మెదక్

నమస్తే తెలంగాణ

ఆదివారం 30 మార్చి 2025

SUNDAY, MARCH 30, 2025

భావితరాలకు మంచి వాతావరణాన్ని అందిద్దాం



దీక్ష చేస్తున్న వీరశైవ లింగాయత్ సంఘ సభ్యులు

నర్సాపూర్, మార్చి 29: డంపింగ్‌యార్డును తరిమికొట్టి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందిద్దామని వీరశైవ లింగాయత్ సంఘ నాయకుడు వీరప్ప గురూజీ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష శనివారం 38వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో భాగంగా నర్సాపూర్‌కు చెందిన వీరశైవ లింగాయత్ సంఘ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. నర్సాపూర్‌ను కాలుష్య ప్రాంతంగా తయారు చేస్తుందని గుర్తుచేశారు. డంపింగ్‌యార్డు మూలంగా రాయారావు చెరువు, రామచంద్రపురం చెరువు, మంజీరా నది కలుషితం అవుతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రహించి వెంటనే డంపింగ్‌యార్డు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్, వీరశైవ లింగాయత్ సంఘ సభ్యులు సంగమేశ్వర్, వినోద్‌కుమార్, జితేందర్, డా.సంగమేశ్వర్, భద్రప్ప, రామప్ప, గంగాధర్, ఆనంద్, చంద్రశేఖర్, శివకుమార్, ఈశ్వర్, సీహెచ్ సంగమేశ్వర్ పాల్గొన్నారు.

రోగులకు నిత్యావసర సరుకుల పంపిణీ

నిత్యావసరాలు అందిస్తున్న డాక్టర్లు

చిన్నశంకరంపేట, మార్చి 29: క్షయవ్యాధి సోకినవారు పౌష్టికాహారం, ఆకు కూరలు ఎక్కువగా తినాలని టీబీ పర్యవేక్షణ అధికారి నిర్మల సూచించారు. జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చిన్నశంకరంపేటలోని పీహెచ్‌సీలో క్షయవ్యాధి రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ యాదగిరి, సిబ్బంది వనిత, కు మారి, నందిని, అనిత, నర్సింహులు, సరిత, నాగలక్ష్మి, యాదమ్మ, మాధవి పాల్గొన్నారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 29: పదో తరగతి పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. శనివారం జీవశాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాల్లో 10,517 మందికి 10,486 మంది హాజరయ్యారు. కొల్చారం, పాపన్నపేటలోని నాలుగు పరీక్షా కేంద్రాలను డీఈవో రాధాకిషన్ సందర్శించారు. కొల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని 12 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

సీజ్ చేసిన ఇసుక డంప్ వేలం

తూప్రాన్, మార్చి 29: మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో ఫిల్టర్ చేసి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని, ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక 3 ట్రాక్టర్లు ఉంటుందని, దీని విలువ రూ.9 వేలుగా నిర్ణయించారు. తహసీల్దార్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు ఇసుక డంప్‌ను డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ శనివారం వేలం వేశారు. వేలంలో గుండ్రెడ్డిపల్లికి చెందిన నవీన్ రూ.9 వేలకు దక్కించుకున్నాడు.

'హలో బీసీ చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 29: దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని, తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఆమోదింపజేసి రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టె పోరుగర్జనకు సంబంధించి 'హలో బీసీ చలో ఢిల్లీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బగలాముఖి శక్తిపీఠంలో మహామంత్రహవనం

శివ్వంపేట, మార్చి 29: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో శనివారం అమావాస్య సందర్భంగా అమ్మవారి ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉదయం మహాపూజ, మహామంత్రహవనం జరిగాయి. ధర్‌పల్లి హెచ్‌ఎం వడ్డె శ్రీనివాస్‌రావు కూతురు మానస భక్తులకు అన్నదానం చేశారు.

పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్, మార్చి 29: వాతావరణ కాలుష్యం, నీరు, విద్య, పారిశుధ్యంపై బీవీఆర్ఐటీకి చెందిన కెమికల్ ఇంజినీరింగ్, నర్సాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ వి.శ్రావణి సమీరా శనివారం అవగాహన కల్పించారు. చిత్రలేఖన, క్విజ్ పోటీని నిర్వహించారు. కార్యక్రమంలో బీవీఆర్ఐటీ మేనేజ్‌మెంట్, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే, మేనేజర్ బాపిరాజు, ఇంజినీరింగ్ విభాగాధిపతి భానురాధిక పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీమా కార్యకర్తల కుటుంబాలకు ధీమా

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి
- ఈద్గాలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- కార్యకర్తలకు పార్టీ బీమా అందజేత

నర్సాపూర్‌లోని ఈద్గా వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లిలో వెంకటేశంకు ప్రమాద బీమ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

కౌడిపల్లి, మార్చి 29: బీఆర్ఎస్ సభ్యత్వ బీమా కార్యకర్తల కుటుంబాలకు ధీమాగా నిలుస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని బూరుగడ్డకు చెందిన కాశబోయిన వెంకటేశం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, కాలు కోల్పోయాడు. ఆయనకు పార్టీ నుంచి మంజూరైన సభ్యత్వ బీమా రూ.లక్ష చెక్కును అతడి నివాసానికి వెళ్లి అందజేశారు. తిమ్మాపూర్‌కు చెందిన శ్రావణ్‌కు చికిత్స నిమిత్తం రూ.30 వేల చెక్కు అందజేశారు. ఆమె వెంట పార్టీ అధ్యక్షుడు రామాగౌడ్, రాజునాయక్, నాయకులు ఎల్లం, మహిపాల్‌రెడ్డి, అమర్‌సింగ్, సాయగౌడ్, ప్రవీణ్‌కుమార్, పోల నవీన్, సందీప్, ప్రతాప్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింలు, శేఖర్ పలువురు ఉన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

కౌడిపల్లిలో శ్రీలక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్లో ప్రభుత్వపరంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, కోఆప్షన్ మాజీ సభ్యుడు మహమ్మద్ హైమద్ ఆధ్వర్యంలో కొనసాగిన విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 29: ఇఫ్తార్ విందులో ముస్లింలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పట్టణంలోని ఈద్గాలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే కొన్ని రోజుల క్రితం నర్సాపూర్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈద్గా ప్రాంగణంలో విద్యుత్ సమస్య పరిష్కరించేలా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని ముస్లిం మత పెద్దలు, ప్రజలు కోరారు. వారి కోరిక మేరకు ఎమ్మెల్యే 25 కే.వీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించగా, ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించినందుకు ముస్లింలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, మౌలానా మసియోద్దీన్, లాయక్ అలీ ఖాన్, షేక్ హుస్సేన్, ముజాహెద్‌ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి మహిళ మృతి

హంసీబాయి(ఫైల్)

చిలిపిచెడ్, మార్చి 29: చిట్కుల్ శివారులోని పెట్రోల్ పంపు వద్ద ట్రాక్టర్, టీవీఎస్ ఎక్సెల్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటనలో ఎక్సెల్‌పై ఉన్న ఇద్దరిలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మహిళ హంసీబాయి(35) తీవ్రగాయాలై, దవా ఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విష మించి శనివారం మృతిచెందింది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివ రాల ప్రకారం.. చిలిపిచెడ్ మండలం బద్రియ తండాకు చెందిన సలాబత్ హంసీబాయి జోగిపేటలో కూరగాయలు అమ్మడానికి వెళ్లేది. శుక్రవారం రాత్రి హంసీ కూరగాయలు అమ్మి తిరిగి వస్తున్నది. అందోల్ మండలం కిచ్చిన్నపల్లికి చెందిన మల్లయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తుండగా లిఫ్టు అడిగి ఆయనతో కలిసి వస్తున్నది. చిట్కుల్ శివారులో పెట్రోల్ పంపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, ఎక్సెల్ ఢీకొన్నాయి. దీంతో ఎక్సెల్ నడుతున్న మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. హంసీకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో జోగిపేట దవాఖాన నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, మార్చి 29: మండలంలోని చెన్నాపూర్‌లో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా శనివారం పరామర్శించి రూ.10వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బోళ్ల భారతి భిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

చేగుంట, మార్చి 29: చేగుంటలోని మద్యం దుకాణంలో శనివారం చోరీ జరిగింది. చేగుంట బస్టాండ్ సమీపంలోని కనుకదుర్గ మద్యం దుకాణానికి శుక్రవారం రాత్రి తాళం వేసి, వెళ్లిపోయారు. ఉదయం చూసే సరికి దుకాణం షట్టర్‌ను పగులగొట్టి అందులోని మద్యం బాటిళ్లు, రూ.10వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దళిత వర్గాల ఇల్లు ధ్వంసం చేయడం బాధాకరం

నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిలిపిచెడ్, మార్చి 29: నోటీసులు ఇవ్వకుండా ఇల్లు, రేకుల షెడ్లను కూల్చివేయడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ నాయకుడు దుర్గాదాస్ మాదిగ శనివారం ఖండించారు. చండూర్‌లో దళిత వర్గానికి చెందిన ఏసయ్య ఇంటికి తహసీల్దార్, ఆర్ఐ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కక్షపూరితంగా ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. దళిత సంఘల మండల సభ్యులు ప్రసాద్, మొగులయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్ ఉన్నారు.

సీతారామ కల్యాణోత్సవ పత్రిక ఆవిష్కరణ

నర్సాపూర్, మార్చి 29: సీతారాంపూర్‌లో జరిగే సీతారామ కల్యాణోత్సవ పత్రికను పండితుడు హరిప్రసాద్‌శర్మ నర్సాపూర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆవిష్కరించారు.

వైద్య సేవలను అందుబాటులోకి తెస్తాం

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- నర్సాపూర్, కౌడిపల్లి దవాఖానల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నర్సాపూర్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, మార్చి 29: నర్సాపూర్ ప్రభుత్వ దవాఖాన, కౌడిపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెదక్ జిల్లాలో వైద్య ప్రమాణాలు 24 గంటలు మెరుగుపరిచేందుకు కలెక్టర్ శనివారం అర్ధరాత్రి ఒంటిగంట నుంచి 3 గంటల వరకు నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానను, కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ వైద్యాన్ని పేదలకు చేరువలోకి తెస్తూ, పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏరియా దవాఖానలోని అత్యవసర చికిత్స విభాగం ఇన్‌పేషెంట్ వార్డు, ఔషధాలను నిలువ ఉంచిన డ్రగ్ స్టోర్ తదితర విభాగాలను పరిశీలించామన్నారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, రోగులతో మాట్లాడి, వారికి రాత్రి వేళలో అందుతున్న సదుపాయాలు, ఆరోగ్యం గురించి ఆరా తీసినట్లు తెలిపారు. నర్సాపూర్ ఏరియా దవాఖానను పరిశీలిస్తున్న సుమారు రాత్రి 2 గంటల సమయంలో 108 వాహనంలో మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన మహిళ పురిటి నొప్పులతో వచ్చిందన్నారు. ఆ మహిళకు సిబ్బంది తక్షణమే స్పందించి సాధారణ కాన్పు చేసి తల్లీ బిడ్డలను సురక్షితంగా కాపాడడం హర్షణీయమన్నారు. వైద్య సేవల్లో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు

నిజాంపేట, మార్చి 29: రాంపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఆధ్వర్యంలో ముందస్తుగా విశ్వావసు నామ ఉగాది వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.వేడుకలలో భాగంగా తెలుగు ఉపాధ్యాయుడు చంద్రకాంత్‌గౌడ్ 'బాలకవుల సమ్మేళనం' కార్యక్రమంను నిర్వహించి, కవితాగానం చేసిన బాల కవులకు కథల పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు నరేశ్, కుమారస్వామి, షాదుల్లా విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, మార్చి 29: చందాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు ఉగాది పండుగ వేడుకల్లో ఎంతమో పుష్పవేణి పాల్గొన్నారు. షడ్ రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని విద్యార్థులకు అందించారు. తెలుగు నూతన సంవత్సరంలో విద్యార్థుల భవిష్యత్తులో అన్నిరంగాల్లో రానించాలని ఆమె కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోటవ్వ, స్వప్న పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ బాల్‌రాజు (ఇన్‌సెట్లో మాధవరెడ్డి (ఫైల్)

రామాయంపేట, మార్చి 29: విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోనాపూర్ హనుమాన్ ఆలయం వద్ద జరిగింది. ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. కిచ్చయ్యగారి మాధవరెడ్డి (70), భారతమ్మ భార్యాభర్తలు. వారి ఇంటి వెనకాల ఉన్న హనుమాన్ గుడిలో ఉగాది ఉత్సవాలు నిర్వహించేందుకు శుభ్రం చేస్తున్నారు. భారతమ్మ గర్భగుడిలో శుభ్రం చేస్తున్నది. గుడికింద మెట్ల వద్ద మాధవరెడ్డి చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్నాడు. గుడికి ఆనుకుని ఉన్న విద్యుత్ పోల్ సపోర్టు వైరుకు విద్యుత్ ప్రవహిస్తున్నది గమనించని మాధవరెడ్డి, వైరుకు తగలడంతో అక్కడికక్కడే విగతజీవుడయ్యాడు. కిందకు దిగి అర గంట అయినా రాకపోవడంతో భారతమ్మ కిందకు వచ్చి చూసింది. అప్పటికే మాధవరెడ్డి పడి ఉన్నాడు. మృతుడిని లేపడానికి ప్రయత్నించగా భారతమ్మకూ విద్యుత్ షాక్ తగిలింది. ఘటనా స్థలం నుంచి రోదిస్తూ రోడ్డుకు వచ్చి తన భర్తకు విద్యుత్ షాక్ తగిలిందని చుట్టుపక్కల వారికి తెలిపింది. స్థానికులు అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను బంద్ చేయించారు. వచ్చి చూసే సరికి అప్పటికే మాధవరెడ్డి మృతి చెందాడు. ఎస్ఐ బాలరాజు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుదాఘాతంతో మాధవరెడ్డి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

వృద్ధురాలి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుల అరెస్టు

మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిన్నశంకరంపేట, మార్చి 29: ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి కళ్లలో కారం కొట్టి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివ్వంపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన వృద్ధురాలు ఒగ్గు కమలమ్మ, భర్త లస్మయ్య ఈ నెల 11న చిన్నశంకరంపేట మండలం సంగాయపల్లిలోని తన మనుమరాలి ఇంటికి వెళ్లడానికి గవ్వలపల్లి చౌరస్తా వద్ద బస్సు దిగి, నడుచుకుంటూ వెళ్తున్నారు. మార్గమధ్యలో ఎస్.కొండాపూర్‌కు చెందిన యువకులు మాడబోయిన బాబు, మాడబోయిన గురుచరణ్ వారిని అనుసరిస్తూ, ద్విచక్రవాహనంపై వెళ్లారు. తాము కూడా గుడి వద్దకు వెళ్తున్నామని వారిని నమ్మించి, కమలమ్మను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లారు. కొంతదూరం వెళ్లాక గుడి సమీపంలోని పౌల్ట్రీఫాం వద్ద వారి వద్దనున్న కారం పొడిని కమలమ్మ కళ్లలో చల్లారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి ఆమె మెడలోని గుండ్లు, చెవి కమ్మలు, ముక్కుపుడకను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. కమలమ్మ కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని ఎస్సై నారాయణ దర్యాప్తు చేపట్టారు. శనివారం ఎస్.కొండాపూర్‌కు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించి, విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నృత్య ప్రదర్శనలో శివాని ప్రతిభ

పురస్కారాలతో శివాని, జూనియర్ విభాగంలో గ్లోబల్ ఐకాన్ అవార్డులు అందుకున్న బాలికలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 29: మెదక్‌కు చెందిన నటరాజ కళాతోరణం నృత్య శిక్షణాలయం నాట్యాచార్యులు శివాని బంగారు నంది జాతీయ పురస్కారం అందుకున్నారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా సైన్సు మ్యూజియంలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో శివాని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు శిరీషరెడ్డి, కమేడియన్ మోహన్‌బాబు బంగారు నంది పురస్కారం అందజేశారు. జూనియర్ విభాగంలో లక్ష్మి, సహస్ర, విన్మయ్, నిహారిక, విద్యశ్రీ, మేధశ్రీ, శాన్వి, వైష్ణవి, విశాలి, భానుశ్రీ గ్లోబల్ అవార్డులు అందుకున్నారు.

కేసీఆర్‌ను కలిసిన శేరి

ఎమ్మెల్సీగా ఆరేండ్ల పదవీ కాలాన్ని పూర్తిచేసుకున్న శేరి సుభాష్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

పద్మాదేవేందర్‌రెడ్డి

శేరి సుభాష్‌రెడ్డి

రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సరాది శ్రీ విశ్వవసు నామ సంవత్సరం సందర్భంగా కొత్త ఏడాదిలో అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. ఈ పండుగను ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని అభిలాషించారు. మెదక్ నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కంఠారెడ్డి

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ



బీరప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న క్రాంతికిరణ్

అల్లాదుర్గం, మార్చి 29: బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటుందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కడగోని బాలయ్య కుమారుడు బీరప్ప ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం వారి ఇంటికి వెళ్లి బాలయ్య కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహులు, గాండ్ల బస్వరాజ్, సంగప్ప, నాగిశెట్టి, సలీం, బాగయ్య ఉన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కాలేరు నరేశ్

తూప్రాన్, మార్చి 29: హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌కు చెందిన న్యాయవాది, మాజీ ఏజీపీ కాలేరు నరేశ్ ఎన్నికయ్యారు. కాలేరు నరేశ్ హైకోర్టు బార్ అసోసియేషన్‌కు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గెలుపొందినట్లు అధికారికంగా ప్రకటించారు. న్యాయవాదుల హక్కులతో పాటు, సామాన్యులకు హైకోర్టులో సత్వర న్యాయం కోసం సాధ్యమైనంత మేరకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

జాతీయ రహదారులుగా మార్చాలి

పాపన్నపేట, మార్చి 29: మెదక్-బొమ్మట్‌పల్లి, అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డును జాతీయ రహదారులుగా మార్చాలని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జోగినాథ్ గుప్తా డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు రోడ్లను జాతీయ రహదారులుగా మారిస్తే ఉమ్మడి జిల్లావాసులకు మేలు కలుగుతుందన్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో ప్రజలకు దూరభారం తగ్గుతుందన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో ఇటీవల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

రాజీవ్‌యువ వికాస్ గడువు పెంచాలి

చిన్నశంకరంపేట, మార్చి 29: రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని బీఆర్ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి అత్తిలి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5 గడువు ఉన్నందున వరుస సెలవులు రావడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ, ధృవపత్రాలు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్ కార్యాలయంలో సర్వర్ సమస్యతో కుల, ఆదాయ ధృవపత్రాలు రావడం లేదన్నారు. దీంతో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని కోరారు.

మున్సిపల్ సిబ్బందికి ఉగాది పురస్కారాలు

పురస్కారాలు అందజేస్తున్న ఆర్డీవో

తూప్రాన్, మార్చి 29: తూప్రాన్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ఉగాది ఉత్తమ సేవా పురస్కారాలను ఆర్డీవో జయ చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి శనివారం అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ సైనికులు దేశం కోసం సేవ చేస్తే, కార్మికులు ప్రజల ఆరోగ్యం కోసం అలుపెరుగని సేవ చేస్తారన్నారు. తూప్రాన్ ప్రెస్‌క్లబ్ అందిస్తున్న సే